సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 22 । మార్చి । 2024



ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

ప్రపంచ అటవీ దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అటవీ శాఖ అధికారులు పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమాలు పెద్దయెత్తున చేపట్టారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర : 6:29	శని : 4:55

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0 /22.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'పది' పరీక్షలకు 99.76 శాతం హాజరు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఇంగ్లిష్ పరీక్షకు 99.76శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 52 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 9,297మంది విద్యార్థులకు గాను 9,275 మంది హాజరయ్యారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 9,279మందికి గాను 9,260 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారు. గతంలో ఫెయిలైన విద్యార్థులు 18 మందికి గాను 15 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. బెల్లంపల్లి, మందమర్రిలో పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి, మరో ఐదు పరీక్ష కేంద్రాలను డీఈవో యాదయ్య పరిశీలించారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు 19 పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ దామోదర్‌రావు తెలిపారు.

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

మంచిర్యాలక్రైం: మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ పోలీస్ మహిళల భద్రత కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసిందని, షీ టీమ్స్ పని చేస్తున్నాయని పేర్కొన్నారు. షీ టీమ్స్, మహిళల భద్రతపై అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పని ప్రదేశాలు, ప్రయాణాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వేధింపుల నుంచి షీ టీమ్స్ రక్షణ కల్పిస్తాయని తెలిపారు. వేధింపులకు గురైన వారు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. షీ టీమ్స్ ప్రతీ రోజు విద్యాసంస్థలు, రద్దీ ప్రదేశాల్లో మఫ్టీలో ఉంటూ నిరంతరం నిఘా ఉంచుతాయని తెలిపారు. వేధింపులు, అసభ్యకర సైగలు, సోషల్ మీ డియా ద్వారా పోస్టులతో బ్లాక్‌మెయిల్ చేసినా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. నే రుగా ఫిర్యాదు చేయడానికి ఇబ్బందిగా ఉంటే 100డయల్, లేదా షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700కు మెస్సేజ్ చేయలని తెలిపారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల సందడి

మంచిర్యాలక్రైం: మంచిర్యాల బార్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి నెలకొంది. ఈ నెల 18న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా 20న ముగిసింది. గురువారం స్క్రూటినీ నిర్వహించారు. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ ఉండగా.. ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషనర్ కే.కమలమనోహర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ గుంటుక్ మహేందర్ తెలిపారు. అసోసియేషన్‌లో 295మంది ఓటర్లు ఉన్నారు. అధ్యక్ష స్థానానికి బండవరం జగ్గయ్య, కొత్త సత్తయ్య, డేగ రవీందర్, ఉపాధ్యక్ష పదవికి భుజంగ్‌రావ్, కట్కూరి గంగయ్య, ఏ.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా టీ.అనిల్‌రాజు, కే.మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎం.కనుకయ్య, కే.విజేందర్, కోశాధికారిగా సీహెచ్.దత్తత్రేయ, ఏ.శ్రీనివాస్, లైబ్రరీ సెక్రెటరీగా సాగె గురువయ్య, వీ.రంజిత్, మహిళా రిప్రజెంటిటివ్‌గా ఎస్.రాధిక, స్పోర్ట్స్, కల్చరల్‌గా ఎస్.సంతోష్‌గౌడ్, రంగు వేణుకుమార్, కార్యవర్గ సభ్యులుగా తొమ్మిది మంది పోటీ పడుతున్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

- రామగుండం సీపీ శ్రీనివాసులు
- ఇందారం చెక్‌పోస్టు పరిశీలన



ఇందారం చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సీపీ

జైపూర్: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి–మంచిర్యాల జిల్లాల సరిహద్దు చెక్‌పోస్టుల్లో పోలీసు సిబ్బంది 24గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఇందారం సమీపంలోని గోదావరి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులతో కలిసి వాహనాలు తనిఖీ పరిశీలించారు. కార్లు, బస్సులు, మోటార్‌సైకిళ్ల తనిఖీ చేయాలని సూచించారు. రాత్రి సమయంలో రేడియం జాకెట్స్ ధరించాలని, డబ్బు, మద్యం, బంగారం విలువైన వస్తువులు అక్రమంగా తరలిస్తే సీజ్ చేయాలని పేర్కొన్నారు. రూ.50వేల కంటే ఎక్కువగా డబ్బులు తరలిస్తే తగిన ధ్రువపత్రాలు లేనిపక్షంలో సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాలని తెలిపారు.

ఆర్టీఏలో అదనపు బాదుడు!



జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో కౌంటర్ల వద్ద వేచి ఉన్న వాహనదారులు

- అధికారులు మారినా ఆగని ఏజెంట్ల హవా
- వాహనదారుల నుంచి అధికంగా వసూళ్లు
- రవాణా శాఖలో వ్యవస్థీకృతమైన అక్రమాల తంతు



ఫిట్‌నెస్ పరీక్షల కోసం వచ్చిన వాహనాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా రవాణా శాఖలో ఏజెంట్ల హవా తగ్గడం లేదు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీలు జరిగి కొత్తవారు వచ్చారు. కానీ ఆర్టీఏ కార్యాలయంలో వ్యవస్థీకృతంగా మారిన అక్రమ వసూళ్లు యథేచ్ఛగా సాగుతూనే ఉన్నాయి. వాహనదారులకు ఏ పని అయినా ఏజెంట్లతోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి నిత్యం వందలాది మంది వివిధ రకాల సేవల కోసం వస్తుంటారు. వీరి అవసరాలను క్యాష్ చేసుకుంటూ ఏజెంట్లు దందా నడిపిస్తున్నారు. పని చేసి పెడతామని చెబుతూ అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఈ వసూళ్లలో కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ముట్టజెప్తున్నారు. కొత్తగా వచ్చిన అధికారులూ వారిని నిలువరించలేకపోవడంతో వాహనదారులకు అదనపు బాదుడు తప్పడం లేదు.

అనధికారంగా వసూళ్లు

గతంలో జిల్లాలో సుదీర్ఘ కాలం పని చేసిన కొందరు ఎంవీఐ, ఏఎంవీలు అడ్డగోలుగా వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. బొగ్గు గనులు, ఓసీపీ(ఓపెన్ కాస్టులు)లు, సిమెంట్ కంపెనీలు, గోదావరి ఇసుక రీచ్‌లు, థర్మల్ విద్యుత్ కేంద్రం, సిరామిక్స్ వంటి పరిశ్రమలతో రోడ్డు రవాణా అధికంగా జరుగుతుంది. మంచిర్యాల మీదుగా మహారాష్ట్రతోపాటు ఉత్తర భారతదేశానికి ఇటు కరీంనగర్, హైదరాబాద్, విజయవాడ వైపు వేలాదిగా రాకపోకలు ఉంటాయి. ప్యాసింజర్, ట్రాన్స్‌పోర్టు వాహనాల అధిక లోడ్, ఫిట్‌నెస్‌లు, ట్యాక్స్, నిబంధనల మేరకు అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయా? లేవా అనేది తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఈ తనిఖీల్లో వాహనదారుల నుంచి వసూళ్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో జగిత్యాల నుంచి ఓ క్రషర్ కంపెనీ నుంచి ప్రతీనెల రూ.5వేల చొప్పున వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఇసుక లారీలు, బొగ్గు గనుల్లో భారీ వాహనాలు, యంత్రాల యజమానుల నుంచి మామూళ్లు ముడుతున్నాయి. జిల్లా భూభాగంలో తిరిగే వాహనాల నుంచి కొందరు అధికారులు ప్రైవేటు సిబ్బందితో చేతికి మట్టి అంటకుండా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన ఓ ఎంవీఐ జిల్లాను వదలకుండా ఉంటూ భారీగా సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల బదిలీల్లో అందరూ కొత్త అధికారులు వచ్చారు. కానీ కింది స్థాయి సిబ్బంది అన్నీ తామై కార్యాలయాన్ని నడిపిస్తున్నారు. ఇలాంటి అక్రమాలను నియంత్రించి జిల్లాలో పారదర్శకంగా సేవలు అందించాలని వాహనదారులు కోరుతున్నారు. ఏజెంట్ల జోక్యం, అనధికార వసూళ్లపై ఇన్చార్జీ రవాణా శాఖ అధికారి టి.సంతోశ్‌కుమార్‌ను 'సాక్షి' సంప్రదించగా, తాము ఇటీవలే బదిలీపై వచ్చామని, ఏజెంట్ల వ్యవస్థ అధికారికంగా లేదని, ఎవరైనా ఆన్‌లైన్, మొబైల్ యాప్‌లోనూ వాహనదారులు సేవలు పొందవచ్చని సూచించారు.

పేరుకే ఆన్‌లైన్.. ఏజెంట్లదే హవా

రవాణాశాఖలో 17రకాల సేవలను వాహనదారులు నేరుగా ఆన్‌లైన్‌లో పొందే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ వెబ్‌సైట్, లేకపోతే మొబైల్‌లో 'టీ యాప్ పోలియో' నుంచి స్వయంగా స్లాట్ బుక్ చేసుకుని సేవలు పొందవచ్చు. టు, ఫోర్, భారీ వాహనాల లైసెన్స్‌లు, ఫిట్‌నెస్‌లు, కొత్తవి, రెన్యూవల్స్, పర్మిట్లు, బ్యాడ్జీ, వాహనాల రిజిస్ట్రేషన్లు, చిరునామాల మార్పులు, యజమాని మార్పు, ట్యాక్స్‌ల చెల్లింపులు, ఆర్సీల జారీ, పన్నుల చెల్లింపులు తదితర సేవలన్నీ అందుతున్నాయి. చాలామందికి వీటిపై అవగాహన లేక ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాస్తవంగా చెల్లించాల్సిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. అడిగితే 'ఇందులో అందరికీ వాటాలు ఉన్నాయి. పని త్వరగా కావాలంటే ఇవ్వాల్సిందే..' అని సమాధానం ఇస్తుంటారు. ఏజెంట్లతో వెళ్లిన వారి పత్రాలపై కోడ్ వేస్తూ పని ఇబ్బంది లేకుండా చేస్తున్నారు.

వెంచర్‌కు అడ్డదారి !

- హైవేను కలిసేలా రోడ్డు వేసుకున్న రియల్టర్లు



పాత మంచిర్యాల వంతెన సమీపంలో నేషనల్ హైవేకు కలుపుతూ వేసిన మట్టిరోడ్డు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వ్యాపారం కోసం ఏకంగా జాతీయ రహదారికే ఓ అడ్డదారి వేశారు. హైవేకు ఆనుకునే తమ వెంచర్ ఉందంటూ కొనుగోలుదారులకు చెబుతూ ప్లాట్లు అమ్మేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు వేసినప్పటికీ అటు ఇంజినీరింగ్ అధికారులు, పోలీసు, ఇటు మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల వంతెన సమీపంలో జాతీయ రహదారి 63ను కలిపేలా ఓ వెంచరు నిర్వాహకులు మట్టిరోడ్డు వేశారు. గతంలో దీనిపై ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే చోట, నేరుగా నేషనల్ హైవేకు కలిసేలా మట్టిపోసి రోడ్డు వేసుకున్నారు. ఇక్కడి నుంచి అనధికారికంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ మూలమలుపుతోపాటు ఇరుకుగా, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే చోటు ఇది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతం(బ్లాక్ స్పాట్)గా గుర్తించారు. ఇవేమీ పట్టించుకోకుండా ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఇనుప రేకులను సైతం తొలగించి రోడ్డు వేసుకున్నారు. అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై జాతీయ రహదారుల డీఈని ఫోనులో సంప్రదించాలని ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

బడి నిర్వహణ నిధులేవి..!



మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

- ఇంకా విడుదల కాని రెండో విడత
- ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- వినియోగించకుంటే మళ్లీ వెనక్కి..
- స్పోర్ట్స్ గ్రాంట్లు విడుదల అంతే..

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల నిర్వహణకు సంబంధించిన రెండో విడత నిధుల విడుదలలో ఇప్పటికీ జాప్యం జరుగుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిధులు జూలైలో మంజూరయ్యాయి. ఈ నెల 31తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుంది. గతంలో కూడా మార్చి 31లోపు నిధులు వచ్చి వెనక్కి వెళ్లడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గత ఏడాది జూలైలో 720 స్కూళ్లకు సగం నిధులు రూ.75.85లక్షలు మంజూరయ్యాయి. మిగతా 50శాతం నిధుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గడువు ముగియకముందే నిధుల మంజూరుకు విద్యాశాఖ స్పందించాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

తలకు మించిన భారం

స్వచ్ఛ పాఠశాలలు సాధించాలని ఓ వైపు ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ పారిశుధ్య నిర్వహణపై పట్టించుకోవడం లేదు. ఉన్న స్కావెంజర్లను తొలగించడంతో స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారింది. పారిశుధ్య బాధ్యతలను పంచాయతీలు, మున్సిపాల్టీలకు అప్పగించినా సిబ్బంది కొరత వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో సిబ్బంది వీలు దొరికినప్పుడు వచ్చినా పరిసరాల పరిశుభ్రతకు పరిమితం కావడంతో పాఠశాలల్లో కంపు కొందుతోంది. మరుగుదొడ్ల శుభ్రతకు కావాల్సిన సామగ్రితోపాటు చాక్‌పీస్‌లు, గదుల శుభ్రానికి కావాల్సిన చీపుర్లు, చిన్నపాటి వసతుల కల్పనకు నిధులు ఎలా సమకూర్చుకోవాలో తెలియక ప్రధానోపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారింది. పాఠశాలలకు స్వచ్ఛత కిట్ల కింద ఏడు రకాల వస్తువులు అవసరమవుతాయి. బకెట్, రెండు మగ్గులు, సర్ఫ్, బ్రష్‌లు, చీపుర్లు, ఇతరత్రా వస్తువుల కొనుగోలుకు నిధులు విడుదల చేయకపోవడంతో ఆ భారం ఉపాధ్యాయులపైనే పడుతోంది. పాఠశాలల్లో అవసరాలు తీర్చేందుకు నిధుల మంజూరుతోపాటు స్కావెంజర్లను నియమించాల్సిన అవసరం ఉంది.

ఖర్చు ఇలా..

నిధులు విడుదల చేసినా ఖర్చు చేసేందుకు ఇబ్బందులు తప్పేలా లేదు. ఇటీవల ఎస్‌ఎంసీలు రద్దయ్యాయి. నిధుల వినియోగానికి ఇంతకుముందు ప్రధానోపాధ్యాయుడితోపాటు ఎస్‌ఎంసీ చైర్మన్ చెక్కులపై సంతకం చేసేవారు. జనవరితో పాత కమిటీ రద్దు కావడంతో.. చెక్కులపై సంతకానికి సీనియర్ ఉపాధ్యాయుడితోపాటు ప్రధానోపాధ్యాయుడికి అవకాశం కల్పించారు. సీనియర్ టీచర్ సంతకం స్కానింగ్ చేయించాల్సి ఉంది. కొన్ని పాఠశాలల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇదంతా పూర్తయి.. నిధులు ఇప్పటికిప్పుడు వస్తే వినియోగానికి అవకాశాలు ఉంటాయి.

మంజూరు ఇలా..

ప్రతీ ఏడాది పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యను అనుసరించి ప్రత్యేక గ్రాంట్లు మంజూరవుతాయి. 1నుంచి 30 వరకు విద్యార్థులుంటే రూ.10వేలు, 31నుంచి 100 వరకు రూ.25వేలు, 101నుంచి 250 లోపు రూ.50వేలు, 251నుంచి 1000 మంది వరకు రూ.75వేలు, వెయ్యి దాటితే రూ.లక్ష నిధులు ఇస్తారు. గత ఏడాది జూలైలో 720 స్కూళ్లకు రూ.75.85లక్షలు వచ్చాయి. స్పోర్ట్స్ గ్రాంటు నిధులు రూ.22.80లక్షలు వచ్చాయి. డిసెంబర్ నాటికి పూర్తి స్థాయి స్కూల్‌గ్రాంటుతోపాటు క్రీడా పరికరాలు కొనుగోలు చేసే స్పోర్ట్స్ గ్రాంటు కూడా విడుదల కావాల్సి ఉంది. ఈ నిధులతో మరుగుదొడ్ల క్లీనింగ్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు, విద్యుత్, తాగునీరు, చిన్నపాటి మరమ్మతులు, స్టేషనరీ, ప్రయోగ సామగ్రి, సుద్దముక్కల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. జాతీయ పండుగల నిర్వహణ, కంప్యూటర్లు, ప్రాజెక్టర్ల నిర్వహణ, ఇంటర్నెట్, డిజిటల్ తరగతుల వరకు నిధులు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- పెద్దపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- చెన్నూర్ నియోజకవర్గంలో కార్యకర్తల సమావేశాలు



జైపూర్‌లో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

మందమర్రిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో బూటకపుహామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వైఫల్యం చెందిందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రచారం చేయాలని పెద్దపల్లి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం మందమర్రిలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన పట్టణ, మండల స్థాయి బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీరు అందక రైతులు పంటలు పండించుకోలేని దుస్థితి నెలకొందని, విద్యుత్ సరఫరా అంతరాయాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ నియోజకవర్గంలో కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ వేల్పుల రవి, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, మండల అధ్యక్షుడు సంజీవరావు, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం

రామకృష్ణాపూర్: కాంగ్రెస్ పాలనలో కరెంటు, నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని, తెలంగాణలో ఒకప్పటి రోజులు మళ్లీ కనిపిస్తున్నాయని పెద్దపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు డాక్టర్ రాజారమేష్, సుదర్శన్‌గౌడ్, గాండ్ల సమ్మయ్య, జాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కష్టకాలంలో పార్టీకి అండగా నిలవాలి

జైపూర్: కష్టకాలంలో పార్టీకి, కేసీఆర్‌కు కార్యకర్తలు, నాయకులు అండగా నిలవాలని, ప్రతిక్షంలో ఉండి ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బల్మూరి అరవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి పాలమాకుల సురేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యారంటీల పేరుతో మోసం

చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచా రంలో భాగంగా గురువారం స్థానిక సంతోషిమాత ఫంక్షన్ హాల్‌లో చెన్నూర్, కోటపల్లి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీపీ మంత్రి బాపు, జె డ్పీటీసీ మోతె తిరుపతి, బెల్లంకొండ కరుణ సాగర్‌రావు, మల్లెల దామోదర్‌రెడ్డి, రాజారమేశ్ పాల్గొన్నారు.

444.2 ఎకరాల్లో పంటలకు నష్టం



అకాల వర్షంతో నేలకొరిగిన మొక్కజొన్న పంట

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బుధవారం కురిసిన అకాల వర్షంతో 383 మంది రైతులు 444.2 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, నువ్వు పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు గురువారం ప్రాథమిక సర్వేలో గుర్తించారు. రూ.23,98,160 వరకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. వడగండ్ల వానతో కొన్ని మండలాల్లో నష్టం వాటిల్లింది. హాజీపూర్, వేమనపల్లి, జైపూర్, మండలాల్లో సైతం వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ప్రాథమిక సర్వేలో నామమాత్రంగా గుర్తించడం సరికాదని, క్షేత్ర స్థాయిలో సర్వేలు చేపట్టి జరిగిన నష్టానికి పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంటల నష్టం వివరాలు

మండలం	గ్రామాలు	రైతులు	ఎకరాలు	నష్టం(రూ.లలో)
దండేపల్లి	13	231	288	15,55,200
లక్సెట్టిపేట	11	108	69.2	3,73,160
జన్నారం	6	44	87	4,69,800

'కాకా' మనవడికే టికెట్

- పెద్దపల్లి ఎంపీ బరిలో గడ్డం వంశీక్రిష్ణ
- ఖరారు చేసిన కాంగ్రెస్ పార్టీ



గడ్డం వంశీక్రిష్ణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీకి గడ్డం వంశీక్రిష్ణను కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపింది. గత కొద్దిరోజులుగా వంశీక్రిష్ణ పేరు ప్రచారంలో ఉన్నప్పటికీ ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ గురువారం అధికారికంగా ప్రకటించారు. కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) మనవడు, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తనయుడు వంశీక్రిష్ణ కుటుంబానికి పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో పట్టుంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీతో తమకు ఉన్న బలమైన సంబంధాలతోనే ఈ అవకాశం దక్కినట్లుగా చెబుతున్నారు. బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ వెంకటేష్‌నేతతో సహా పలువురు టికెట్ కోసం పోటీపడ్డారు. చివరికి అధిష్టానం వంశీక్రిష్ణ వైపు మొగ్గు చూపింది.

ఢిల్లీ నుంచి ఆశీర్వాదంతోనే..

'గడ్డం' ఫ్యామిలీకి మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఢిల్లీలో బలమైన పరిచయాలు, సీఎం రేవంత్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలే వంశీని టికెట్ వరించడంలో కీలకంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన వివేక్‌కు చెన్నూరు టికెట్ ఇవ్వగా, తాజాగా ఎంపీ టికెట్ కూడా తనయుడికే వచ్చింది. బెల్లంపల్లి నుంచి గడ్డం వినోద్ ఉన్నారు. ఇలా పార్టీలో ఒకే ఫ్యామిలీకే అవకాశాలు ఇవ్వడంపై స్థానికంగా కొంత వ్యతిరేకత వచ్చింది. ఇవేవీ పట్టించుకోకుండా అధిష్టానం యువకుడైన వంశీ వైపై మొగ్గు చూపింది. గత కొంతకాలంగా తనకే ఎంపీ టికెట్ ఖరారు అని నమ్మకంతోనే వంశీ తన కుటుంబ వ్యాపారమైన విశాఖ ఇండస్ట్రీస్‌కు జేడీగా పని చేస్తూనే.. ప్రజాక్షేత్రంలో తిరుగుతున్నారు. పార్లమెంట్ పరిధి లో క్రికెట్ టోర్నమెంట్లు, కార్యక్రమాలు చేస్తున్నా రు. ప్రజా మద్దతు కూడగడుతున్నారు. తనకు మద్ద తు ఇవ్వాలంటూ స్థానిక ఎమ్మెల్యేలతో పరిచ యం పెంచుకుంటూ తండ్రి బాటలో నడుస్తున్నారు.

అభ్యర్థి ప్రొఫైల్..

పేరు:	గడ్డం వంశీక్రిష్ణ
తల్లిదండ్రులు:	గడ్డం వివేక్, సరోజ
వయస్సు:	40సంవత్సరాలు
విద్యార్హతలు:	ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ బాకాల్యూరేట్ గ్రాడ్యుయేషన్, యూనైటెడ్ వరల్డ్ కాలేజీ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియా కాలేజీ, సింగపూర్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, అండ్ మేనేజ్‌మెంట్, పర్డ్యూ యూనివర్సిటీ, యూఎస్ఏ.
వృత్తి:	వ్యాపారం, 2019లో ఎలక్ట్రిక్ వాహన ఆటోమొబైల్ కంపెనీ స్థాపన
ప్రస్తుత హోదా:	జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, విశాఖ ఇండస్ట్రీస్

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మహిళ మృతి

శ్రీరాంపూర్: ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ ఆర్కే6 గాంధీనగర్‌కు చెందిన అల్లాడి వైష్ణవి (33) మెప్మాలో ఆర్పీగా పనిచేస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా బుధవారం ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలికి భర్త వేణు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

కౌటాల: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన మోర్లె పోచుబాయి ఇంట్లో గురువారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో విద్యుత్ తీగల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బ్యాగులో ఉంచిన రూ. 50 వేల నగదు, ఇంట్లోని టీవీ, ఫ్యాన్లు, పరుపులు, దుస్తులు, ఇతర సామగ్రి కాలిపోయినట్లు తెలిపారు. ఘటనలో రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి వివరాలు సేకరించారు.

నకిలీ సర్టిఫికెట్ లెక్చరర్ తొలగింపు

ఆసిఫాబాద్‌రూరల్/బెజ్జూర్: నకిలీ సర్టిఫికెట్లతో కాంట్రాక్టు ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేయించుకున్న బెజ్జూర్ జూనియర్ కళాశాల గణిత అధ్యాపకుడు కలవేణి నాగరాజును ఉద్యోగంలో నుంచి తొలగిస్తూ ఆర్జెడీ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఐఈవో శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని గత మే నెలలో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 2011 నుంచి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం చేస్తున్న నాగరాజుపై ఫిర్యాదు రావడంతో విచారణ అనంతరం ఉద్యోగంలోంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తేనే నగదు



ప్రొసీడింగ్ అందజేస్తున్న గ్రీవెన్స్ కమిటీ

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల నేపథ్యంలో తనిఖీల్లో పట్టుబడిన నగదుకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తేనే తిరిగి ఇవ్వడం జరుగుతుందని గ్రీవెన్స్ కమిటీ అధికారులు వి.గణపతి, జి.హనుమంతురెడ్డి, జే.రాజేశ్వర్ తెలిపారు. గురువారం జిల్లాలో తనిఖీల్లో పట్టుబడిన బాధితులు నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేయగా.. విడుదలకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. ఈ నెల 19న బెల్లంపల్లి కాల్‌టెక్స్ సమీపంలో ఆర్.ప్రవీణ్‌కుమార్ నుంచి రూ.1,11,900 స్వాధీనం చేసుకున్నారు. గురువారం ధ్రువీకరణ పత్రాలు అందజేయడంతో నగదు విడుదలకు గ్రీవెన్స్ టీం ప్రొసీడింగ్‌ను అందజేశారు.

వెంటాడుతున్న ప్రమాదాలు

- తగ్గని మానవ తప్పిదాలు
- సింగరేణిలో గతేడాది ఐదుగురు మృతి
- ఈ ఏడాది ఇప్పటికే ఇద్దరు
- సీరియస్ ప్రమాదాలపై ఆందోళన



ఎస్సార్పీ-1 గనిలో ప్రమాదానికి గురైన సత్యనారాయణ

శ్రీరాంపూర్: సింగరేణిలో మళ్లీ ప్రమాదాలు వెంటాడుతున్నాయి. గతేడాది ప్రమాదాల సంఖ్య తగ్గిందని సంతోషపడుతుంటే ఈ ఏడాది ఆరంభం నుంచే మళ్లీ ప్రమాదాలు చోటు చేసుకోవడం కలవరపెడుతోంది. యాజమాన్యం రక్షణ చర్యలు తీసుకున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం ప్రమాదాలు ఇంకా పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టలేదు. అయితే కొంతకాలంగా అనుకోని ప్రమాదాల కంటే మానవ తప్పిద ప్రమాదాలే ఎక్కువ కావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. 2023లో కంపెనీ వ్యాప్తంగా ఐదుగురు కార్మికులు వివిధ ప్రమాదాల్లో మృత్యువాతపడ్డారు. అంతకు ముందు ఏటా రెండంకెల సంఖ్యలో మరణాలు ఉండేవి. ప్రమాదాలు తగ్గాయనుకుంటున్న సమయంలో 2024 ఆరంభంలోనే నమోదైన ప్రమాదాల సంఖ్య చూస్తే ముందుముందు ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. జనవరి 1, 2024 నుంచి ఇప్పటి వరకు ఇద్దరు కార్మికులు వివిధ ప్రమాదాల్లో మృతి చెందారు. ఇందులో ఆర్జీ-1 ఒకరు, మందమర్రిలో ఒకరు మృత్యువాతపడ్డారు. 2023లో కంపెనీ వ్యాప్తంగా 68 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వివిధ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారు ప్రస్తుత ఎస్సార్పీ 1 గని ప్రమాదంతో కలిపితే 14 మంది ఉన్నారు. ఇందులో మందమర్రి స్టోర్స్‌లో రాజు అనే కార్మికుడు మృతి చెందిన ఘటన మరువకముందే నేడు ఎస్సార్పీ-1 గనిలో కార్మికుడు సత్యనారాయణ రెండు పాదాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యాయి. ప్రమాదాలకు కారణం ఏదైనా దాని మూల్యం మాత్రం కార్మికుడే చెల్లించుకోవడం విచారించదగింది.

నిలిచిన సేఫ్టీ సమావేశాలు

సింగరేణిలో విధిగా నిర్వహించాల్సిన సేఫ్టీ సమావేశాలను కంపెనీ నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది. మైన్స్, ఏరియా, కంపెనీ స్థాయిలో జరగాల్సిన సేఫ్టీ సమావేశాలు నిర్ణీత కాలంలో జరగడం లేదు. మైన్స్‌లో అప్పుడప్పుడు జరుగుతున్నా మిగితా ఏరియా, కార్పొరేట్ ట్రైపార్టీయేట్ సేఫ్టీ సమావేశాలు ఆర్నెళ్లకోసారి జరగాల్సి ఉండగా జరగడం లేదు. దీనికి తోడు గనుల్లో సమస్యలపై చర్చించాల్సిన స్ట్రక్చరల్, జేసీసీ సమావేశాలు కూడా గుర్తింపు ఎన్నికల పేరుతో కంపెనీ నిర్వహించడం లేదు. దీంతో ప్రమాదాల నివారణపై క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు, వాటిపై చర్చలు జరుగకపోవడం కూడా ఈ ప్రమాదాలకు పరోక్ష కారణమని కార్మిక సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.

ఎస్‌వోపీలపై మరింత అవగాహన..

సింగరేణిలో ప్రమాదాల నివారణకు ఇటీవల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. దీనికోసం సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్(ఎస్‌వోపీ)లను తయారు చేశారు. దీని ప్రకారం ఉద్యోగి విధులు నిర్వహించేటప్పుడు ఎలా రక్షణతో పని చేయాలో ఇందులో ఉంది. అయినా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ఎక్కువగా మానవ తప్పిద ప్రమాదాలే నమోదవుతున్నాయి. ఎస్‌వోపీలను కాదని షార్ట్‌కట్ పద్ధతిలో ఉద్యోగులు పనులు చేస్తూ తరచూ ప్రమాదాలకు కారణం అవుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. గతంలో ఎక్కువగా రూఫ్‌పాల్, సైడ్‌పాల్, అనుకోని, అంచానా వేయని ప్రమాదాలు(గాడ్ ఆఫ్ యాక్ట్) జరిగేవి. ఇందులో యాజమాన్యం తప్పిదాలే ఎక్కువగా ఉండేవి. ఈ తరహా ప్రమాదాలు ఇటీవల గణనీయంగా తగ్గాయి. కానీ అక్కడక్కడా జరుగుతున్న కొన్ని యాజమాన్యం రక్షణ ఉల్లంఘన చర్యలు, మరి కొన్ని మానవ తప్పదాల ప్రమాదాలు మరింత కట్టడి చేయాల్సి అవసరముందని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. జీరో ప్రమాదాల లక్ష్యాన్ని కంపెనీ ఎప్పుడు చేరుకునేలా మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

2023 జనవరి 1 నుంచి ప్రమాదాల వివరాలు

ఏరియా	మృతుల సంఖ్య
ఎల్లందు	: 1
ఆర్జీ-1	: 2
ఆర్జీ-2	: 1
ఆర్జీ-3	: 2
మందమర్రి	: 1

తీవ్రంగా గాయపడిన వారు

ఏరియా	కార్మికుల సంఖ్య
కొత్తగూడెం	: 1
ఎల్లందు	: 2
మణుగూరు	: 6
ఆర్జీ-1	: 10
ఆర్జీ-2	: 12
ఆర్జీ-3	: 2
భూపాలపల్లి	: 18
బెల్లంపల్లి	: 1
మందమర్రి	: 10
శ్రీరాంపూర్	: 19

చోరీకి విఫలయత్నం

మందమర్రిరూరల్: పట్టణంలోని రాష్ట్రీయ రహదారి పక్కన నూతనంగా ఏర్పడిన లక్ష్మీ భవానీ కాలనీలో మేకల లక్ష్మణ్ ఇంట్లో గురువారం తెల్లవారుజామున దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. గమనించిన లక్ష్మణ్ అరవడంతో దొంగలు పారిపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ శశిధర్ రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట ఎస్సై రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

గుడుంబా పట్టివేత



పట్టుకున్న గుడుంబాతో ఎస్సై, సిబ్బంది

మందమర్రిరూరల్: పట్టణంలోని దొరలబంగ్లాస్ ఏరియాలో గురువారం విక్రయించడానికి సిద్ధంగా ఉన్న ఆరు లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నిందితుడు మనుపాటి సంపత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నెన్నెల మండలం నుంచి గుర్తు తెలియని వ్యక్తి ద్వారా గుడుంబా తక్కువ ధరకు కొనుగోలు చేసి మందమర్రిలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత



పట్టుకున్న లారీతో ఎస్సై

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా మంచిర్యాల గోదావరి నుంచి జగిత్యాలకు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి డ్రైవర్ పడాల సాయికిరణ్, క్లీనర్ ఎమ్మాజీ ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ పట్టివేత

గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో వేంపల్లి గ్రామ శివారులోని గోదావరి నుంచి అనుమతులు లేకుండా ఓ ట్రాక్టర్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని బొడ్డు శంకర్, డ్రైవర్ కుర్ర అంజిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లోనే డెలివరీ చేసిన 108 సిబ్బంది



పాపను అప్పగిస్తున్న 108 సిబ్బంది

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పెద్దాపూర్‌లో గురువారం గర్భిణికి పురిటినొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది ఇంట్లోనే డెలివరీ చేసి తల్లీబిడ్డలను కాపాడారు. పెద్దాపూర్‌కు చెందిన వెద్మ స్వప్నకు పురిటినొప్పులు రావడంతో ఆశ కార్యకర్త 108 సిబ్బందికి సమాచారం అందించింది. సిబ్బంది అక్కడికి వెళ్లి పరిస్థితి గమనించడంతో అక్కడి నుంచి కనీసం అంబులెన్స్‌లోకి తరలించే సమయం కూడా లేకపోవడంతో ఇంట్లోనే ప్రసవం చేయగా పాపకు జన్మనిచ్చింది. 108 ఈఎంటీ ఆత్మారావు, పైలట్ రాజేశం అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స నిర్వహించి కాసిపేట పీహెచ్‌సీకి తరలించారు. తల్లీబిడ్డలు క్షేమంగానే ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల నగదు పట్టివేత



వాంకిడి: పట్టుబడిన నగదుతో ఎస్సై సాగర్



జైనూర్: జంగాంలో పోలీసులు పట్టుకున్న నగదు

వాంకిడి: మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్ వద్ద గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీలో వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.2.25 లక్షల నగదు పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్ర వైపు నుంచి ఆసిఫాబాద్ వైపు వస్తున్న శ్రీనివాస్‌రావు వద్ద నుంచి రూ.లక్ష, సంజీవ్ వద్ద నుంచి రూ.1.25 లక్షల నగదు పట్టుబడినట్లు తెలిపారు. ఎలాంటి పత్రాలు లేని కారణంగా నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి, కెరమెరి ఎంపీవో అమ్జాద్ పాషా, తదితరులు ఉన్నారు.

జైనూర్: మండలంలోని జంగాం గ్రామంలో గురువారం రూ.2.45 లక్షల నగదు పట్టుకున్నట్లు సీఐ అంజయ్య తెలిపారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా ముగ్గురు వాహనదారులు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2.45 లక్షల నగదు పట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జైనూర్, సిర్పూర్(యు) ఎస్సైలు సందీప్‌కుమార్, మాధవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ నిరంతరం జరగాలి

- మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్




ఇందన్‌పల్లిలో కారును తనిఖీ చేస్తున్న ఏసీపీ

జన్నారం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీ నిరంతరం జరగాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ అన్నారు. గురువారం జన్నారం మండలం ఇందన్‌పల్లి బార్డర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం సమస్యాత్మక రేండ్లగూడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని నియమించాలన్నారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్, రెండవ ఎస్సై మృత్యుంజయ సర్కార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కవాతు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గాంధీ చౌక్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు పోలీసులు పెద్ద ఎత్తున కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రకాశ్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రజలకు నమ్మకం కలిగించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ నరేందర్, ఎస్సై చంద్రకుమార్, అదనపు ఎస్సై రామయ్య, పోలీస్ బలగాలు పాల్గొన్నాయి.

ఓటుందా.. సరిచూసుకోండి..!



- ఏప్రిల్ 15వరకు నమోదుకు అవకాశం

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఓటర్ల వివరాలిలా...

నియోజకవర్గాలు: 07
(సిర్పూర్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముధోల్)

మహిళలు: 8,41,250

పురుషులు: 8,02,267

ఇతరులు: 87

మొత్తం ఓటర్లు: 16,43,604

భైంసాటౌన్(ముధోల్): లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగింది. ఎన్నికల సంఘం ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ సైతం ప్రకటించింది. మే 13న ఎన్నికలు జరగనుండగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్-2024)లో భాగంగా గత నెల 8న ఓటరు తుది జాబితా విడుదల చేసింది. ఈ మేరకు తుది జాబితాలో ఓటు ఉందో.. లేదో పరిశీలించుకుని.. లేనిపక్షంలో నమోదు చేసుకునేందుకు అవకాశమిచ్చింది. ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోనివారు, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చినవారు ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. నూతనంగా ఓటు నమోదు చేసుకునేవారు ఫారం -8 ద్వారా ఆన్‌లైన్‌లో లేదా బూత్ లెవల్ అధికారిని సంప్రదించి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ఆన్‌లైన్‌లో nvsp.in, ceotelangana.nic. in, voters.eci.gov.in వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటు ఉందో లేదో సరిచూసుకునేందుకు ఆన్‌లైన్‌లో nvsp.in, ceotelangana.nic.in వెబ్‌సైట్లలో తెలుసుకోవచ్చు.

మొత్తం ఓటర్లు 16.43 లక్షలు

ప్రత్యేక ఓటరు సవరణ తుది జాబితా ప్రకారం ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 16,43,604 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 8,02,267 మంది పురుషులు, 8,41,250 మంది మహిళలు, 87 మంది ఇతరులు ఉన్నారు. ప్రస్తుత ఓటరు జాబితా ప్రకారం సిర్పూర్ మినహా అన్ని నియోజకవర్గాల్లోనూ పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు. దీంతో రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ అభ్యర్థుల జయాపజయాల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. అలాగే అన్ని నియోజకవర్గాలతో పోలిస్తే నిర్మల్‌లో అత్యధికంగా 2,56,147 మంది ఓటర్లు ఉండగా, తక్కువగా బోథ్‌లో 2,10,915 మంది ఓటర్లు ఉన్నారు. థర్డ్ జెండర్ ఓట్లలోనూ నిర్మల్ 20 ఓట్లతో ముందంజలో ఉండగా, బోథ్‌లో ఇద్దరే ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	1,14,484	1,14,359	12	2,28,855
ఆసిఫాబాద్	1,12,510	1,14,056	16	2,26,582
ఆదిలాబాద్	1,19,154	1,24,375	06	2,43,535
బోథ్	1,02,333	1,08,580	02	2,10,915
నిర్మల్	1,21,070	1,35,057	20	2,56,147
ఖానాపూర్	1,09,508	1,14,445	13	2,23,966
ముధోల్	1,23,208	1,30,378	18	2,53,604



లింగ నిర్ధారణ చేయవద్దు



సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని రేడియాలజిస్టులు లింగ నిర్ధారణ పరీక్షలు చేయవద్దని, పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌ను ప్రతి ఒక్కరూ అనుసరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లాలోని 13 మంది ప్రభుత్వ, ప్రైవేటు రేడియాలజిస్టులతో గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను రిజిస్టర్ చేసుకోవాలని, రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులు, సూపర్ స్పెషాలిటీ వైద్యులు స్కానింగ్ కోసం పీసీపీఎన్‌డీటీలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, స్కానింగ్ రూమ్‌లలో ఎలాంటి ఫొటోలు పెట్టవద్దని, రోగులకు సరైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

వాతావరణ మార్పులతో జాగ్రత్త

వేసవి తాపం, అకాల వర్షాలు, వాతావరణంలో మార్పులతో వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది, ఎండీవోలు, ఎంపీవోలకు అసంక్రమణ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.విజయపూర్ణిమ, సీహెచ్‌వో డాక్టర్ లింగారెడ్డి, డెమో వెంకటేశ్వర్, డాక్టర్ శివప్రసాద్, సుమన్, ప్రవళిక, చారి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

దండేపల్లి: యాసంగి వరి ధాన్యాన్ని ఐకేపీ సంఘాల ద్వారా కొనుగోలు చేసి ఆర్థిక సాధికారత సాధించాలని డీఆర్‌డీవో కిషన్ సూచించారు. స్థానిక శ్రీలక్ష్మీ మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామైక్య సంఘాలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణతో గ్రామైక్య సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం కుట్టే బాధ్యత కూడా అప్పగించినట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు మహిళా సంఘాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, డీపీఎం వేణుగోపాల్, ఏపీఎం బ్రహ్మయ్య, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు అల్లంల అనిత, సీసీలు, వీవోఏలు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.